# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పరిశోధనలు, ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థకు నిజమైన చోదక యంత్రాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఉద్ఘాటించారు.
- ❖ జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా రేపు బాధ్యతలు చేపట్టనున్నారు.
- ❖ కాలుష్యాన్ని తగ్గించడంలో విద్యుత్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు.
- ❖ కేరళ, మాహే, పుదుచ్చేరి, కరైకల్ లో ఈనెల 15వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఈ రోజు తెలిపింది.

====================================

పరిశోధనలు, ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థకు నిజమైన చోదక యంత్రాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఉద్ఘాటించారు. ఈ రోజు ఢిల్లీలో మహారాజా అగ్రసేన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. ఆవిష్కరణలు, పరిశోధనల రంగంలో పెట్టే పెట్టుబడులు వర్తమాన, భవిష్యత్ కు పెట్టుబడని తెలిపారు. వాణిజ్యం, వ్యాపారం, పరిశ్రమల్లో ఉన్నవారు వ్యవస్థ ఒత్తిడికి లోనుకావొద్దని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 42 సెకన్లు)

====================================

గిరిజనుల ప్రయోజనాలు, సంక్షేమాన్ని భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకుంటుందని ఆ పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జార్ఖండ్ లోని బొకారోలోని చందన్ క్యారీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ రోజు జరిగిన విజయ్ సంకల్ప్ అభియాన్ లో నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ.. బీజేపీకి గిరిజన సోదర

సోదరీమణుల ఆకాంక్షలు, ఆత్మగౌరవం ఎల్లప్పుడూ ప్రధానమన్నారు. జార్ఖండ్ రాష్ట్రాన్ని తామే ఏర్పాటు చేశామని, అందుకే అభివృద్ధి చేసి తీరుతామని  స్పష్టం చేశారు.

=====================================

జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా రేపు బాధ్యతలు చేపట్టనున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం ఈ రోజుతో ముగిసింది. దీంతో సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారు. రేపు ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో రాష్ట్రపతి భవన్ లో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో 1983లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న ఆయన, 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులై.. ఆ తరువాతి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు అందుకున్నారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రేపు ప్రధానన్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 2025 మే 13 వరకు ఆ పదవిలో కొనసాగనున్నారు.

=====================================

స్క్వాష్ క్రీడలో ఆస్ట్రేలియా సిడ్నీలో జరుగుతున్న న్యూ సౌత్ వేల్స్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ ను భారత దేశానికి చెందిన అనహత్ సింగ్ కైవసం చేసుకుంది. ఫైనల్లో ఆమె 3-1తో హాంకాంగ్ కు చెందిన హెలెన్ టాంగ్ ను ఓడించింది. తొలి సెట్ ను 8-11తో టాంగ్ కు అనహత్ కోల్పోయింది. వెంటనే పుంజుకున్న అనహత్ సింగ్, తర్వాతి మూడు సెట్లను 11-6, 11-3, 11-4 తేడాతో గెలిచి విజయం సాధించింది. అనహత్ కెరీర్లో ఏడో పీఎస్ఏ ఛాలెంజర్ టూర్ టైటిల్ ఇది.

=====================================

జమ్మూకశ్మీర్  లోని కిశ్త్వాడ్ జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రత బలగాలకు మధ్య ఈరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ ఆర్మీ అధికారి (జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్) మృతి చెందారు. మరో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కిశ్త్వాడ్ జిల్లాలో ఇద్దరు విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ ను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి హతమార్చారు. దీంతో వారిని పట్టుకునేందుకు బలగాలు స్థానికంగా పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి.

ఈ క్రమంలోనే కేశ్వాన్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రత సిబ్బందికి మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. “ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి అందిన నిఘా సమాచారం ఆధారంగా బలగాలు సంయుక్త ఆపరేషన్ ప్రారంభించాయి. ఎన్‌కౌంటర్‌లో తొలుత జేసీవో సహా నలుగురు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. చికిత్స పొందుతూ  ఆర్మీ అధికారి ప్రాణాలు కోల్పోయారు.

విరామం

=====================================

కాలుష్యాన్ని తగ్గించడంలో విద్యుత్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. ఈ రోజు ఢిల్లీలో ఎలక్ట్రిక్ వాహనాల ర్యాలీని కేంద్రమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఇదే సమయంలో 'ఈవీ యాజ్ ఏ సర్వీస్' కార్యక్రమాన్ని కూడా కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానంగా పారిశ్రామిక కార్యకలాపాలు, నిర్మాణ పనులు, రవాణా ద్వారా కాలుష్యం ఏర్పడుతున్నాదని, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి రంగం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ  కార్యక్రమం ముఖ్యంగా ఢిల్లీకి చాలా అవసరమైనదని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================================

రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర' ను బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు ముంబైలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తున్నదన్నారు. యువకులు, పేదలు, రైతులు, మహిళల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు రూపొందించామని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (MVA) కూడా మేనిఫెస్టోను ఈ రోజు ప్రకటించింది. ఈ సందర్భంగా జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మేనిఫెస్టోను విడుదల చేశారు.

=====================================

కేరళ, మాహే, పుదుచ్చేరి, కరైకల్ లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ రోజు తెలిపింది. తమిళనాడులో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని ఆ శాఖ పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్, వాయవ్య పంజాబ్ లో మరో రెండు రోజుల పాటు దట్టమైన పొగమంచు ఉంటుందని వివరించింది. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో వచ్చే 2 నుండి 3 రోజుల పాటు రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

=====================================

గ్రేటర్ నోయిడా ఎక్స్ ప్రెస్ వే పై కారు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఈ రోజు ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. నోయిడా ట్రాఫిక్ ఏడీసీపీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నోయిడా నుంచి పారి చౌక్ కు వెళ్తుండగా ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దేవీసింగ్, అతని భార్య, కుమారుడితో పాటు కారులో ప్రయాణిస్తున్న మరో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను అధికారులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

=====================================

దక్షిణా ఆఫ్రికాలోని గెబెర్హాలోని సెయింట్ జార్జ్స్ పార్క్ వేదికగా ఈరోజు 2వ టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్, సౌతాఫ్రికా జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి భారత్ 12 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది.

=====================================

మహిళల ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 రేపటి నుంచి బీహార్ లోని రాజ్ గిర్ లో ప్రారంభం కానుంది. భారత్ సహా ఆరు దేశాల జట్లు పాల్గొంటున్న, ఈ అంతర్జాతీయ క్రీడా పోటీలను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రేపు సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ నెల 20న ముగియనున్న ఈ టోర్నమెంట్ లో అన్ని మ్యాచ్ లు స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నూతనంగా నిర్మించిన రాజ్ గిర్ హాకీ స్టేడియంలో జరుగుతాయి. ఈ టోర్నీలో పాల్గొనేందుకు భారత్, చైనా, జపాన్, మలేషియా, థాయ్ లాండ్, కొరియా జట్లు బోధ్ గయాకు చేరుకున్నాయి. రేపు మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలకు జపాన్, కొరియా జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది.

=====================================

రష్యా మొదటి ఉప ప్రధానమంత్రి డెనిస్ మంటురోవ్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ రాయబార కార్యాలయం ఈ రోజు పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా రేపు ముంబైలో జరగనున్న రష్యన్ - ఇండియన్ బిజినెస్ ఫోరమ్ ప్లీనరీ

సెషన్‌లో ఆయన పాల్గొంటారని తెలిపింది. నవంబర్ 12న ఇంటర్ గవర్నమెంటల్ రష్యన్-ఇండియన్ కమిషన్ నిర్వహించే కీలక సమావేశంలో డెనిస్ మంటురోవ్, భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తో సమావేశం అవుతారని వెల్లడించింది.

====================================

====================================